# ఎందరో పూజారులు.... అందరికీ....

నేను కథలు బాగా రాస్తాను. చిన్నప్పట్నుంచీ నేను వ్రాసిన కథలు చదివిన వారందరూ మెచ్చుకున్నారు. పత్రికల్లో ప్రచురింపబడ్డాయి.

నేను క్రికెట్ బాగా ఆడతాను. కాలేజి మ్యాచిల్లో ఎప్పుడాడినా సెంచరీ కొట్టేవాణ్ణి.

చదువులో నేను కాలేజికి ఫస్టు. ఇంటర్మీడియెట్ అవగానే ఇంజనీరింగులో సీటు వచ్చింది. తన శక్తికి మించిందే అయినా నన్ను చదివించారు నాన్న. నా క్లాసులో మూడవ

వాడిగా నేను కెమికల్ ఇంజనీరునయ్యాను.

నాకుద్యోగం వచ్చింది. జీతం పరవాలేదు.

నాకు పెళ్లి కూడా అయింది. కట్నం పరవాలేదు.

నా భార్య అందగత్తె. మా ఇద్దరికీ ఈడూ జోడూ చక్కగా కుదిరిందని అంతా చెప్పుకునేవారు. అన్ని విధాలా నేనదృష్టవంతుణ్ణని అంతా అనుకుంటున్నారు. పెళ్ళయ్యే దాకా నేనూ అలాగే అనుకున్నాను.

గుమాస్తాలుగా జీవితాలు వెళ్ళబుచ్చుతున్న నా స్నేహితులతో పోల్చుకుంటే నా జీతం చాలా ఎక్కువ. నా జీవితం సుఖమైంది.

సామాన్య మధ్యతరగతి వాణ్ణి కాబట్టి కూడా నా జీతం నా కెక్కువే అనిపిస్తోంది.

అయితే నాకులాగే సామాన్య మధ్య తరగతి నుంచి వచ్చిన నా భార్యకలా అనిపించడం లేదు. ఆమె తన ఇంట్లో తల్లిదండ్రుల ద్వారా తీరని కోరికలన్నీ నా ద్వారా తీర్చుకోవాలనుకుంటోంది. నా దృష్టిలో ఖరీదైనవన్నీ ఆమె దృష్టిలో సామాన్యమూ, నిత్యావసరమూను.

రిఫ్రిజరేటరు, స్టీరియోసెట్, కలర్ టీవి, స్కూటరు వగైరాలు నాకు నిత్యావసరాలైతే కావచ్చు. కానీ నాన్నకు నా సాయం కంటే ఎక్కువ అవసరాలు కావవి. ప్రతి నెలా నా జీతంలో అయిదో వంతు నేను నాన్నకు పంపేస్తాను. నా భార్య ఏమన్నా పట్టించుకోను.

ఒక మంచి పని చేస్తున్నానన్న ఆనందం నన్ను సంతోషంగా ఉంచాలి. కానీ నా భార్య నాకు మనశ్శాంతి లేకుండా చేస్తోంది.

అదేమని నేను దెబ్బలాడితే "నేను కోరుతున్నది మీ సుఖం. మీ ప్రగతి. మీ సాటివాళ్లంతా ఎలాగుంటున్నారో చూడండి.రేపు మనకు పిల్లలు పుడితే ఎంత దరిద్రంగా ఉంటామో ఆలోచించండి!" అనేదామె.

నా భార్య అబద్ధం చెప్పడంలేదు. నా బోటి ఇంజనీర్లంతా నా కంటే ఎంతో వైభవంగా జీవిస్తున్నారు. అయితే వాళ్ళు అవినీతికి పాల్పడ్డారు.

అవినీతి నావల్ల కాదు. అందులోనూ అవసరమైకాక, అత్యాశకు పోయి అవినీతికి పాల్పడడం నాకింకా అసహ్యం!

నాకూ, నా భార్యకూ మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతూ నాకు మనశ్శాంతి లేకుండా చేయడంతో నేను సాయంత్రాలు మా యింటికి దగ్గర్లోనే ఉన్న రామాలయానికి వెళ్లడం ప్రారంభించాను.

అక్కడ నన్నాకర్షించినది గుడిలో రాముడి కంటే గుడి పూజారి శ్రీమన్నారాయణ!

శ్రీమన్నారాయణ వయసులో నాకంటే నాలుగైదేళ్ళు చిన్నయి ఉంటాడు. కానీ మాటల్లో నా కంటే చాలా అనుభవజ్ఞుడనిపిస్తుంది. గొప్ప తేజస్సుంది.

"నిన్ను నీవు మరిచిపో. అన్నింటికి దేవుణ్ణి నమ్ముకో. నీ నమ్మకాన్ని వ్రతాలు, పూజలు,

కానుకల రూపంలో దేవుడికి సమర్పించుకో. జీవితంలో ఒక్కో మెట్టే పైకెక్కి ఉన్నత స్థానాన్నిచేరుకుంటావు'' అన్నాడు శ్రీమన్నారాయణ.

''దేవుడికి నా బాధలు తెలియవా? సర్వాంతర్యామికి పూజలు చేసి నా బాధలు విన్నవించుకోవడం అవసరమా? నిష్కాముడూ, నిరాకారుడూ అయిన భగవంతుడికి కానుకలెందుకు?'' అనడిగాను.

శ్రీమన్నారాయణ యోగ పురుషుడిలా నవ్వాడు, ''చాలా మంది అడిగే అమాయక ప్రశ్నలివి! భగవంతుడు సర్వాంతర్యామి కావచ్చు. కానీ ఒక విగ్రహాన్ని ప్రత్యేకంగా ఆలయంలో ఉంచి పవిత్ర వాతావరణాన్ని సృష్టించడం ఎంతైనా అవసరం. శృంగారాన్ని పడకగదికి పరిమితం చేసుకోవడం వల్లనే మనిషి జంతువు నించి వేరుపడ్డాడు. క్రికెట్, ఫుట్ బాల్ వంటి ఆటలు నియమావళికి లోబడి నియమిత స్థలంలో ఆడినప్పుడే వాటికి రాణింపు. నడిరోడ్డు మీద అడే ఆటలకు విలువుండదు సరిగదా నిరసన కూడా లభిస్తుంది. మనసు నిలకడ కోసం మనిషి చేసుకున్న ప్రత్యేకమైన ఏర్పాటు దేవాలయం! ఇక కానుకల విషయ మంటావా? ఈ సృష్టిని నడిపించే భగవంతుడికే పైసలివ్వని వాడు సాటి మనిషికేం సాయపడగలడు? మనిషిలో స్వార్థాన్ని రక్షింపజేసి, త్యాగాన్ని ప్రవేశపెట్టడానికే ఈ కానుకలు!''

అతడి మాటలు నా కెంతగానో నచ్చాయి. ఆ రోజు నుంచి నేను వారం వారం రాముడికి పూజలు చేయిస్తున్నాను. విడిగా కానుక లిస్తున్నాను.

అందువల్ల నా ఖర్చులు పెరిగాయే కానీ తరగలేదు. అయినా నేను పట్టించుకోలేదు.

ఇప్పుడు నా భార్య నన్ను వేధిస్తున్నా నా మనసుకు శాంతిగానే ఉంటోంది. నా నుంచి నన్ను వేరు చేసుకుని నా మనసుకు నచ్చిన పని చేయడం శ్రీమన్నారాయణ దయవల్ల నాకలవడింది.

దేవుణ్ణి నమ్ముకున్న వాడికే దిగులూ, చింతా ఉండదని అర్థమయ్యే నా చిన్నతనంలో దారుణ వైధవ్యం అనుభవిస్తూ కూడా భగవత్ ధ్యానంలో నిత్యసంతోషిగా ఉండే బామ్మ గుర్తుకొచ్చింది.

ఒక రోజున దేవాలయంలోనే నాకు శ్రీమన్నారాయణ తండ్రి కృష్ణమూర్తితో పరిచయమైంది. ఆయన నన్ను ఆప్యాయంగా పలకరించి నా గురించి వివరాలడిగి తెలుసుకుని, ''ఈ వయసులో ఇంత భక్తి నీకెలా అలవడింది?'' అనడిగాడు.

నా కథ చెప్పుకున్నాను.

కృష్ణమూర్తి అంతా విని నిట్టూర్చి, ''నీవు జీవితంలో పైకి రాలేవు. దేవుణ్ణి నమ్ముకున్నా సరే!'' అన్నాడు.

''ఎందుకని?'' అన్నాను బాధగా, దిగులుగా!

''ఉదాహరణకు నా పిల్లల్నే తీసుకో. నాకు నలుగురు మగపిల్లలు. పెద్ద వాడికి చదువు బాగా వచ్చింది. ఇంజనీరయ్యాడు. కానీ ఇంజనీరుకు మన దేశంలో విలువేముంది?

అవినీతికి పాల్పడితే తప్ప డబ్బు రాదు. వాడిచేత నేను కాంపిటీటివ్ పరీక్షలు రాయించి బ్యాంకు ఆఫీసర్ని చేశాను. వాడి జీతం, వైభవం, వాడికున్న సదుపాయాలూ నీతిగా ఉద్యోగం చేసే ఏ ఇంజనీరుకూ లేవు. అంటే దీని అర్థమేమిటి? మన దేశంలో చదువుకు తగ్గ ఉద్యోగం చేయకూడదు".

"నేనొప్పుకోను!" అన్నాను.

"అందుకు ఋజువులున్నాయి. మా రెండో వాడికి చదువు రాలేదు. కానీ వాడు అద్భుతమైన నటుడు. సినిమాల్లోకి పోవాలనుకున్నాడు. సినిమాల్లో రాణించడానికి నటన కావాలా? అందులో రాణించిన వాళ్లందరూ నటులా? నువ్వు విన్నావో లేదో హీరోలను కావాలనుకుని కమేడియన్, విలన్ అయిన వాళ్లున్నారు. గాయకులు కావాలనుకుని హీరో లైనవాళ్ళూ, కెమెరా చేత పట్టాలని హీరోయిన్లుగా మారిన వాళ్ళూ, దర్శకులుగా మారిన నిర్మాతలూ, రచయితలూ - ఇలా ఎందరో పక్కదార్లు పట్టి పేరు తెచ్చుకున్న వాళ్లున్నారు. మా వాడు నిజంగా నటుడు కాబట్టి సినిమా రంగంలోకి వెడితే ఊరూ పేరూ లేని క్యారెక్టర్ యాక్టర్‌గా మిగిలిపోతాడని భయపడి రాజకీయాల్లో ప్రవేశపెట్టాను. అద్భుతంగా రాణిస్తున్నాడు..."

"ఊ.." అన్నాను.

"మా మూడోవాడు బియ్యేలో హిస్టరీ, ఎకనామిక్స్, పాలిటిక్సు చదివాడు. వాడికి దేశం చరిత్ర తెలుసు. మన రాజకీయ వ్యవస్థ గురించి తెలుసు. ఆర్థిక వ్యవస్థ గురించీ తెలుసు. వ్యాపారం చేస్తే బాగా రాణిస్తాడని నాకు తెలుసు. చిలక్కి చెప్పినట్టు చెప్పాను. వినలేదు. తన చదువు దేశానికుపయోగలూపడాలన్నాడు. ఎమ్మేలో ఎకనామిక్స్ చేసి యూనివర్సిటీకి ఫస్టుగా వచ్చాడు. ఉద్యోగం దొరక్క నానా అవస్థలు పడి చివరకు ఓ ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్‌గా కుదిరాడు. నా కొడుకులందరిలోనూ తీసికట్టుగా ఉన్నది వాడొక్కడే! చదివిన చదువుకు, అర్హతకు తగ్గ ఉద్యోగం చేస్తున్నదీ వాడే!"

"అయితే ఏమంటారు?"

"నువ్వు నిజంగా రచయితవి. అందువల్ల నీ రచనలు అడపాదడపా పత్రికల్లో రావచ్చు. కానీ రచయితగా ధనార్జన చేయలేవు. ధనార్జన చేయాలంటే మార్గం వేరే ఉంది. సమర్థుడైన ఏ సంపాదకుడైనా తల్చుకుంటే ప్రచారంతో ఒక సామాన్య రచయితను సూపర్ స్టార్ ను చేయగలడు. సామాన్య రచయితనే ఎందుకు చేయగలడంటే ఉత్తమ సాహిత్యాభిరుచులు, ఆలోచనాశక్తి ఉన్న ఏ రచయితకూ సూపర్ స్టార్ కావాలన్న కోర్కె ఉండటం అసంభవం. సూపర్ స్టార్ అయిన సామాన్య రచయిత చుట్టూ అప్పుడెందరో చేరతారు. తన ఆర్జనను పెంచుకునేందుకు తాను సినిమాల్లో పైకి వచ్చిన హీరోల్లా అయిన వారిని విస్మరించవచ్చు. నమ్మకద్రోహం చేయవచ్చు... ఏమైనా చేయవచ్చు...."

నేనాశ్చర్యంగా వింటూంటే...ఆయనింకా కొనసాగిస్తున్నారు.

"మన క్రికెట్ విషయమే చూడు. మేటి బ్యాట్స్‌మెన్‌గా ఇప్పుడు పేరొందిన రవిశాస్త్రి,

మొహిందర్ అమర్‌నాథ్ .. అలనాటి జయసింహా వీరందరూ బౌలర్సుగా టెస్టు మ్యాచిల్లో ప్రవేశించారు. బ్యాటింగ్ స్థానంలో వారి నెంబరు పది. చివరకు వారందరూ బ్యాట్స్‌మన్‌గా మారిపోయారు. కేవలం బ్యాటింగు కోసమే వారిని మ్యాచిలో ఉంచుకునే పరిస్థితి ఏర్పడింది. దీన్ని బట్టి తేలేదేమిటంటే మన దేశంలో ఎవ్వరూ అర్హతకు తగ్గ స్థానంలో రాణించరు. నువ్వు క్రికెట్లో బ్యాట్స్‌మన్‌వు కాబట్టి ఎంతో అదృష్టముంటే తప్ప బ్యాట్స్‌మన్‌గా రాణించేఅవకాశం లేదు నీకు''.

''అయితే నేనేం చేయాలంటారు?''

''నీవు రచయితవు. నీ రచనా శక్తిని ఇంజనీరుగా నీ రిపోర్టుల్లో చూపించు. నీ బాస్ ని డైలాగ్సుతో మెప్పించు. ఫారిన్ ఛాన్స్ రావచ్చు. అలాగే నీవు ఆటగాడివి. సైడ్ బిజినెస్ ప్రారంభించి ప్రజల జీవితంతోనో, నీ ఉద్యోగంతోనో ఆటలాడు. నీవు ఇంజనీరువు, నీ పరిజ్ఞానంతో సాహిత్యంలో రచనలు చేయి. ఎప్పుడు అర్హతకు తగని పని చేస్తావో అప్పుడు నువ్వు బాగుపడతావు...''

నేనాలోచిస్తూ, ''అప్పుడు నన్ను దేవుడు క్షమిస్తాడా?'' అన్నాను.

''దేవుడు నిన్ను క్షమించడని అనుమానమైతే దేవుణ్ణి నమ్మకు''

నేనాశ్చర్యంగా ''అప్పుడు నన్ను దేవుడు క్షమించినా మీ అబ్బాయి క్షమిస్తాడా?'' అన్నాను.

కృష్ణమూర్తి నవ్వి ''అసలైన దైవభక్తుడు దేవుడి పేరు చెప్పి వ్యాపారం చేయలేడు. నిజమైన దైవభక్తుడికి పరచింతనే తప్ప ఇహం గురించిన ధ్యాస ఉండదు. ఎందుకో నీకు ప్రపంచజ్ఞానం కలిగించాలన్న కోరిక పుట్టి ఓ పరమ రహస్యం చేప్పేస్తున్నాను. మా నాలుగో వాడు శ్రీమన్నారాయణకి చదువు రాలేదు. వాడు ఆలయ పూజారిగా రాణిస్తాడని తెలిసే తరతరాలుగా మా ఆధ్వర్యంలో ఉన్న గుడిని వాడి కప్పగించాను'' అన్నారు గర్వంగా.

''అతడు పూజారిగా రాణిస్తాడని మీకెలా తెలుసు?'' అన్నాను.

''ఎందుకంటే వాడు నాస్తికుడు కాబట్టి!''

విజయగర్వం ఉన్నప్పుడు మనిషి ఆ మైకంలో తన రహస్యాలు కూడా బయటపెట్టడంలో ఆశ్చర్యం లేదు. అయితే కృష్ణమూర్తి బైటపెట్టిన రహస్యం నన్ను కూడా పూజారిని కమ్మంటోంది.

ప్రతి కార్యాలయం ఒక దేవాలయం. ప్రతి వృత్తి ఒక పూజ. ఆ దేవాలయంలో రాణించాలంటే శ్రీమన్నారాయణవంటి పూజార్లు కావాలి!

దేశంలో చాలా మంది పూజారులున్నారని నాకు తెలుసు. నేనూ వారితోపాటు చేరాలని అప్పుడే వృద్ధిలోకి రాగలననీ ఇప్పుడే నాకు తెలిసింది! ★

*(ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక -- 7-12-91)*